కిరాణా ముసుగులో పెట్రోల్ వ్యాపారం





ఆరిలోవ కాలనీ ఆఖరి బస్‌స్టాప్ వద్ద అనధికారికంగా పెట్రోల్ విక్రయిస్తున్న పలు దుకాణాలున్న ప్రాంతం

ఆరిలోవ ప్రాంతంలో విచ్చలవిడిగా అనధికారిక పెట్రోల్ విక్రయాలు జరుగుతున్నాయి. బంక్‌ల్లో పెట్రోల్ విక్రయాలకు ప్రభుత్వం నుంచి అనుమతి ఉంటుంది. నిబంధనలు మీరి ఇతరులెవ్వరూ పెట్రోల్‌ను బయట విక్రయించకూడదు. ఎక్కడపడితే అక్కడ అమ్మితే అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరగడానికి అవకాశం ఉంటుంది. అందుకే పెట్రోల్‌ను బంక్‌ల్లో భూమి లోపల నిల్వ ఉంచి వాహనాల ట్యాంకుల్లో పోస్తారు. అంత కట్టుదిట్టమైన జాగ్రత్తలతో చేపట్టే ఈ వ్యాపారాన్ని కొందరు కిరాణా వ్యాపారం ముసుగులో బడ్డీకొట్లు, దుకాణాల్లో నిల్వ ఉంచి అనధికారికంగా విక్రయిస్తున్నారు. దీని వల్ల పెట్రోల్ విక్రయదారులు ప్రమాదాలకు గురవడం, ప్రమాదాలకు కారణమవడం జరుగుతోంది.

- ఆరిలోవ ప్రాంతంలో విచ్చలవిడిగా విక్రయాలు
- ఇళ్లు, దుకాణాల్లో అనధికారికంగా నిల్వ
- ప్రమాదాలతో స్థానికుల్లో ఆందోళన
- పట్టనట్టు వ్యవహరిస్తున్న పోలీసులు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో పెట్రోల్ వ్యాపారం జోరుగా సాగుతోంది. బంక్‌ల్లో ధర కంటే లీటర్‌కు రూ.10 అదనంగా తీసుకొని విక్రయిస్తున్నారు. విశాఖ కేంద్ర కారాగారం గేటు పక్కన బడ్డీల్లో ఓ వ్యాపారి నిరంతరం పెట్రోల్ విక్రయిస్తున్నాడు. ఆరిలోవ ఆఖరి బస్‌స్టాప్ వద్ద ఓ కిరాణా షాపు, బాలాజీనగర్‌లో వినాయక గుడి పక్కన ఓ బడ్డీ, రవీంద్రనగర్‌లో ఓ వ్యాపారి, పెదగదిలి కూడలి ఎదురుగా ఓ బడ్డీ, జోడుగుళ్లపాలెంలో ఓ బడ్డీలో విచ్చలవిడిగా పెట్రోల్ అమ్ముతున్నారు. దీంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు.

అంతా అనధికారకమే..

ఇక్కడ అనధికారికంగా పెట్రోల్ వ్యాపారం జరగడానికి బంక్‌ల నిర్వాహకులు, పోలీసులు వ్యాపారులకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యాపారులకు పెట్రోల్ బంక్‌ల నిర్వాహకులు పెద్ద క్యాన్‌ల్లో 10 నుంచి 15 లీటర్ల వరకు పెట్రోల్ పోసి ఇస్తున్నారు. వారు వాటిని తీసుకెళ్లి బడ్డీల్లో బాటిళ్ల చొప్పున అమ్ముకుంటున్నారు. ఎక్కువగా డెయిరీఫారం వద్ద పెట్రోల్ బంక్ నుంచి క్యాన్‌ల్లో వ్యాపారులకు పెట్రోల్ విక్రయిస్తున్నారని తెలిసింది. ఇది నిబంధనల ప్రకారం నేరమైనా.. వారు ఇష్టానుసారంగా వ్యాపారులకు ఇవ్వడం విశేషం. ఈ విధంగా వారి సహకారంతో బయట వ్యాపారులకు పెట్రోల్ సరఫరా అవుతోంది.

ఇదిలా ఉండగా.. అనధికారికంగా జరుగుతున్న పెట్రోల్ వ్యాపారానికి ఆరిలోవ పోలీసులు సహకారం పుష్కలంగా అందిస్తున్నారు. ప్రతి అనధికారిక షాపు నుంచి నెలకు 5 లీటర్ల చొప్పున పెట్రోల్ వారి వాహనాల్లో వేస్తున్నట్లు సమాచారం. పెట్రోలింగ్‌కు వెళ్తున్న పోలీస్ వాహనాల్లో ఈ వ్యాపారులు పెట్రోల్ వేస్తున్నట్లు తెలిసింది. పోలీసులకు సాధారణంగా పెట్రోల్ అలవెన్స్ ఉన్నా.. ఇక్కడ చిలక్కొట్టుడు కొడుతున్నారని స్థానికులు అంటున్నారు. ఇలాంటి ప్రమాదకరమైన అనధికారిక వ్యాపారాలను నిర్వహించకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పెట్రోల్ నిల్వలతో ప్రమాదాలు



చల్లయ్యమ్మ(ఫైల్)

పెదగదిలిలో అనధికారికంగా పెట్రోల్ నిల్వ ఉంచిన ఇంట్లో గత నెల 28న అగ్నిప్రమాదం జరిగి సియ్యాద్రి చల్లయ్యమ్మ(55) అనే మహిళ అగ్నికి ఆహుతైన విషయం తెలిసిందే. ఇక్కడ ఆస్తి నష్టంతోపాటు ప్రాణ నష్టం కూడా సంభవించింది. ఆ కుటుంబ సభ్యులు వారి ఇంటి ముందు చిన్న బడ్డీ నడుపుతున్నారు. కిరాణా సామగ్రితోపాటు అనధికారికంగా పెట్రోల్ విక్రయిస్తున్నారు. బంక్ నుంచి పెద్ద డబ్బాలతో పెట్రోల్ తీసుకొచ్చి ఇంట్లో నిల్వ ఉంచారు. అవసరమైన వారికి ఇంట్లో నుంచి బాటిళ్లతో పెట్రోల్ తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ఆగస్టు 28న సాయంత్రం కరెంట్ పోవడంతో చీకటిలో చల్లయ్యమ్మ ఇంట్లోకి వెళ్లి కొవ్వొత్తి వెలిగిస్తుండగా పక్కనే డబ్బాలతో ఉన్న పెట్రోల్‌కు మంట అంటుకొంది. ఆమె మంటల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయింది. ఇంట్లో సామగ్రి కాలిబూడిదైంది. ఆ సమయంలో పెద్ద వర్షం కురవడం, అంతా తడిగా ఉండటంతో చుట్టుపక్కల నివాసాలకు ఆ మంటలు వ్యాపించకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గతంలో కేంద్ర కారాగారం వద్ద షాపులు అగ్ని ప్రమాదానికి గురయ్యాయి. ఆ ప్రమాదానికి కూడా అక్కడ ఓ షాపులో నిల్వ ఉంచిన పెట్రోల్ అంటుకోవడమే కారణమని స్థానికులు ఆరోపించారు.

పెట్రోల్ విక్రయాలు ప్రమాదకరమే..

నివాసాల మధ్య బడ్డీల్లో పెట్రోల్ అమ్ముతున్నారు. దానివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. నాలుగు రోజుల కిందట పెదగదిలిలో ఇంట్లో ఉన్న పెట్రోల్ వల్ల అగ్ని ప్రమాదం జరిగి చల్లయ్యమ్మ మృతి చెందింది. గతంలో మేము చాలాసార్లు పెట్రోల్ అమ్మవద్దని వారితో చెప్పాం. అయినా వినలేదు. దుకాణాల్లో పెట్రోల్ విక్రయించడం ప్రమాదమే.

– ఎస్.రామారావు, పెదగదిలి

అనధికారిక విక్రయాలను నియంత్రించాలి

ఆరిలోవ ప్రాంతంలో చాలాచోట్ల అనధికారికంగా పెట్రోల్ విక్రయిస్తున్నారు. వాటి వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అందుబాటులో బంక్‌లు ఉండగా.. ఇళ్ల మధ్య వ్యాపారులు లాభం కోసం పెట్రోల్ అమ్ముతున్నారు. ఇది ప్రమాదం. అనధికారకంగా పెట్రోల్ విక్రయాలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టాలి.

– పి.శాంతారావు, ఆరిలోవ కాలనీ

చిట్టీల నిర్వాహకురాలిని అరెస్ట్ చేయాలి

ఆరిలోవ: ఆరిలోవలో చిట్టీలు వేసి తోటి మహిళలకు టోకరా వేసిన వెంకటలక్ష్మిని పోలీసులు వెంటనే అరెస్ట్ చేయాలని ఐద్వా మహిళలు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు శనివారం ఐద్వా కమిటీ ఆరిలోవ జోన్ అధ్యక్షురాలు ఎస్.మంగమ్మ, కార్యదర్శి ఎల్.గౌరి ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంతో నమ్మకంతో ఉన్న వెంకటలక్ష్మి వద్ద ఆరిలోవతో పాటు నగరంలోని పలు ప్రాంతాల నుంచి సుమారు 120 మంది చిట్టీలు వేశారన్నారు. వారి నుంచి ఆమె సుమారు రూ.3 కోట్లు వసూలు చేసిన అనంతరం పరారైందని చెప్పారు. దీనివల్ల బాధితులంతా ఆర్థికంగా నష్టపోయారన్నారు. వెంకటలక్ష్మి పరారవడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆరిలోవ పోలీసులు స్పందించి వెంకటలక్ష్మిని తక్షణం అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

ఘనంగా క్యాపింగ్ సెరమనీ



నర్సింగ్ విద్యార్థినికి క్యాప్ పెడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, డాక్టర్ సునీత

బీచ్‌రోడ్డు: సెయింట్ జోసెఫ్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ 35వ క్యాపింగ్ సెరమనీ శనివారం వుడా చిల్డ్రన్స్ ఎరీనాలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథి దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ సునీత, డాక్టర్ మురళీసంతోష్, పల్లా దుర్గారావు కార్యక్రమానికి హాజరయ్యారు. వంశీకృష్ణ మాట్లాడుతూ నర్సులు కూడా డాక్టర్లతో సమానంగా పనిచేస్తున్నారని, వారి సేవలు ఎనలేనివని కొనియాడారు. అనంతరం నర్సింగ్ విద్యార్థులందరితో ప్రమాణం చేయించి వారికి క్యాప్‌లు, దుస్తులు అందజేశారు. కాలేజ్ ఛైర్మన్ డాక్టర్ సునీత రెడ్డి మాట్లాడుతూ 35 ఏళ్ల నుంచి కాలేజీ నిర్వహిస్తున్నామని, విశాఖలో మొదటి ప్రైవేట్ నర్సింగ్ కళాశాల తమదేనని తెలిపారు. నర్సింగ్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో డైరెక్టర్లు అనిత, శ్రీకాంత్, సిరట్ల వాసు, నర్సింగ్ సూపరింటెండెంట్లు భాగ్యలక్ష్మి, భవాని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చంద్రమౌళీశ్వర శర్మకు అభినందన



చంద్రమౌళీశ్వర శర్మను సత్కరిస్తున్న ఆధ్యాత్మిక వేత్తలు

ఎంవీపీకాలనీ: టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ విశాఖ శాఖ సూపరింటెండెంట్ చంద్రమౌళీశ్వర శర్మకు పలువురు అభినందనలు తెలిపారు. టీటీడీలో వివిధ హోదల్లో పనిచేసిన ఆయన శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా శనివారం విశాఖలోని హిందూ ధర్మ ప్రచార పరిషత్ సిబ్బంది, పలువురు ఆధ్యాత్మిక వేత్తల ఆధ్వర్యంలో ఆయనను సత్కరించారు. దశాబ్దాలుగా టీటీడీకి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టీటీడీ విశాఖ మేనేజర్ హైమావతి, ఆధ్యాత్మిక వేత్తలు డాక్టర్ రాంబాబు, హెచ్‌డీపీఎం సత్యనారాయణ, డాక్టర్ రాంబాబు, హెచ్‌డీపీ సభ్యులు సత్యకుమార్, స్వాతి, శ్రీనివాస్, గోపాల్, శ్యాంసుందరరావు, లలితా మణి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ రిజిస్ట్రార్‌కు శుభాకాంక్షలు



రిజిస్ట్రార్ ధనుంజయరావును అభినందిస్తున్న పైడా కృష్ణప్రసాద్

తాటిచెట్లపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావును పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్ శుభాకాంక్షలు తెలియజేశారు. రిజిస్ట్రార్‌ను కార్యాలయంలో శనివారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఉషోదయ విద్యాసంస్థల అధినేత రమణాజీ పాల్గొన్నారు.

పేద విద్యార్థినులకు ఆర్థిక సాయం



విద్యార్థినులకు నగదు అందిస్తున్న దాతలు

మద్దిలపాలెం: శ్రీ షిర్డీసాయినాథ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇద్దరు పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేశారు. కొత్త వెంకోజీపాలేనికి చెందిన కూలి పనిచేసే కాళ్ల మహేష్ పిల్లలు హేమలత(8వ తరగతి), దివ్య(7వ తరగతి)ల ఉన్నత చదువులకు అసోసియేషన్ ఆధ్వర్యంలో దాతలు పి.రవితేజ, కాళ్ల అనిల్‌కుమార్ రూ.20 వేలు అందజేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినుల చదువుకు అండగా ఉంటామని సభ్యులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మద్దాల నరసింహారావు, మద్దాల వీర వెంకట అప్పారావు, ఆడారి కామేశ్వరరావు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



మిజోరం గవర్నర్ హరిబాబును సత్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార: మిజోరం గవర్నర్ కె.హరిబాబుని ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్‌రాజు శనివారం ఘనంగా సత్కరించారు. దసపల్లా హిల్స్‌లోని నివాసంలో హరిబాబును ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు బీజేపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ కన్వీనర్ ఎం.సురేష్ బాబు ఉన్నారు.

రిటైర్డ్ జైల్ అధికారులకు సత్కారం



శ్రీరామచంద్రరావుకు మొమెంటో అందిస్తున్న జైల్ అధికారులు



రెబెకా మేరీని సత్కరిస్తున్న జైల్ అధికారులు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో సేవలందించిన ఇద్దరు అధికారులు పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా వారిని జైల్ అధికారులు ఘనంగా సత్కరించారు. జైల్ డిప్యూటీ సూపరింటెండెంట్ పి.శ్రీరామచంద్రరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.రెబెకా మేరీ శనివారం రిటైరయ్యారు. కారాగార సమావేశ మందిరంలో వారిద్దరిని ముఖ్య అతిథి జైల్ సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్ సిబ్బందితో కలిసి సత్కరించి మొమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామచంద్రరావు, రెబెకా జైల్‌లో విశేషంగా సేవలు అందించారని కొనియాడారు. వారి శేష జీవితం ఆరోగ్యంగా, ప్రశాంతంగా సాగాలని కోరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జైల్ అడిషనల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ కమలాకరరావు, జైలర్లు, డిప్యూటీ జైలర్లు, వార్డర్లు పాల్గొని రిటైర్డ్ అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం



మాట్లాడుతున్న గొండు సీతారాం

విశాఖ విద్య: జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ,జిల్లా విద్యా శాఖ సంయుక్తంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో శనివారం ఎన్ఏడీ దరి సరస్వతీ విద్యావిహార్ పాఠశాలలో జీసీడీవో డాక్టర్ ఖలీషా బేగం సమన్వయకర్తగా, గోపాలపట్నం ఎంఈవో సోమేశ్వరరావు అధ్యక్షత బాలల హక్కులపై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీతారాం మాట్లాడుతూ ప్రహరీ క్లబ్‌ల ఏర్పాటుతో పిల్లల దృష్టి మత్తు వైపు మరలకుండా అవగాహన కల్పించాలన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌తో పాటు బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలల ప్రాంగణాల్లో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ చైర్‌పర్సన్ ఉమారాజ్,సైకాలజిస్ట్ మంత్రి వంశీ, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు,ఐ.సి.డి.ఎస్ అధికారి ఎం.వి.రమణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ ప్రేమికులకు వృక్షమిత్ర అవార్డులు



అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న నిర్వాహకులు

తాటిచెట్లపాలెం: వృక్షమిత్ర కన్నం శ్రీనివాసరావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఏయూ ఎన్ఎస్ఎస్ భవనంలో వృక్షమిత్ర అవార్డులను ప్రదానం చేశారు. ముఖ్య అతిథి ఏయూ రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.కిషోర్‌బాబు మాట్లాడుతూ మానవ మనుగడ, సర్వజీవుల సుఖజీవనానికి వృక్ష సంపదను రక్షించాలని పిలుపునిచ్చారు. ఏయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ హరనాథ్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఏటా అనేక మొక్కలు నాటుతున్నారని, చెట్ల పెంపకంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారన్నారు. అనంతరం పలువురు పర్యావరణ ప్రేమికులకు కిషోర్ బాబు చేతుల మీదుగా అవార్డులు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఉదయ్ భాస్కర్, లక్ష్మీకుమారి, ట్రస్ట్ అధ్యక్షుడు కన్నం రమణారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు పదవీ విరమణ సన్మానం



బొట్ట శ్రీనివాసరావును సన్మానిస్తున్న వీఎంఆర్‌డీఏ అధికారులు

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏలో 37 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో సేవలందించి శనివారం పదవీ విరమణ పొందిన కార్యనిర్వాహక ఇంజినీర్ బొట్ట శ్రీనివాసరావును శనివారం సంస్థ అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు చేసిన సేవలను అధికారులు కొనియాడారు. నిబద్ధతతో అనేక అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ.. వాటిని పూర్తి చేసి అందరి మన్ననలు పొందారని ప్రశంసించారు. అనంతరం ఆయనను దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో సంయుక్త కమిషనర్ రవీంద్ర, కార్యదర్శి కీర్తి, చీఫ్ ఇంజినీర్ భవానీశంకర్, ఎస్టేట్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, ఎస్ఈ బలరామరాజు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెరిపివ్వని వాన.. కూలీల హైరానా

వర్షంతో పనులు లేక ఇబ్బందులు



ఇసుకతోట పెట్రోల్ బంక్ వద్ద పని కోసం కూలీల ఎదురుచూపులు



ఇసుకతోటలో జోరుగా కురుస్తున్న వర్షం

మద్దిలపాలెం: వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పనులు దొరక్క దినసరి కూలీల జీవనం అస్తవ్యస్తంగా మారింది. రెక్కాడితే కానీ డొక్కాడని కూలీల బతుకుల్లో వాయుగుండం ఆవేదన నింపింది. ఐదు రోజులుగా పనులు లేక.. చేతుల్లో డబ్బులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. రోజువారి కూలీ పనులు చేసుకుంటే జీవించే వీరి పరిస్థితి దయనీయంగా మారింది. ప్రతి రోజు ఇసుకతోట పెట్రోల్ బంక్ వద్దకు వందలాదిగా కూలీలు ఎంతో ఆశగా పనుల కోసం వస్తున్నారు. వారి దగ్గరలో ఏ వాహనం ఆగిన పరుగునా వెళ్లి పనులు ఉన్నాయా బాబూ.. అంటూ దీనంగా అడుగుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షం కారణంగా నిర్మాణం రంగంలో కొన్ని విభాగాల్లో పనులు నిలిపివేశారు. ఇతర పనులు చేయించడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో కూలీలకు పనులు లేకుండా పోయాయి. తెల్లవారుజామున పనులు వచ్చిన కూలీలు ఉదయం 11 గంటల వరకూ వేచి చూసి.. నిరాశగా ఇంటి ముఖం పడుతున్నారు. ఏ రోజుకారోజు బత్తెంతో బతకడం అలవాటు పడిన కూలీలు.. పనులు లేక విలవిలాడుతున్నారు. చాలా వరకూ ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి వలస వచ్చి అద్దె ఇళ్లలో ఉంటున్నారు. అద్దె చెల్లించడానికి నెలాఖరు కావడంతో అవస్థలు పడుతున్నారు. ప్రత్యామ్నాయ్న పనులు చేసే అవకాశం లేక కూలీ పనుల కోసమే ఎదురు చూస్తున్నారు. వరుణుడు కరుణించి తగ్గుముఖం పట్టాలని ప్రార్థిస్తున్నామంటూ కూలీలు చెబుతున్నారు.

చిరువ్యాపారులు సతమతం

తెరిపివ్వకుండా కురుస్తున్న వర్షానికి రోజువారి కూలీలతోపాటు చిరు వ్యాపారులు సతమతమవుతున్నారు. పనులు లేక, వ్యాపారాలు సాగక ఇక్కట్లకు గురవుతున్నారు. రోజూ తెల్లవారు జామునే ఇసుకతోట జంక్షన్ వద్ద వందలాది మంది కూలీలు పనుల కోసం ఎదురు చూస్తున్నారు. వర్షం ప్రభావంతో ఏ ఒక్కరూ వారికి పనులు కల్పించడానికి ముందుకు రావడం లేదు. చిరు వ్యాపారులు తోపుడు బండ్లపై కొబ్బరిబొండాలు, కూరగాయలు, పండ్లు, టిఫిన్లు పెట్టుకుని జీవించే వారు వ్యాపారులు సాగక ఇబ్బందులు పడుతున్నారు.

రెక్కాడితేనే డొక్కాడేది



రోజూ కూలి పనులు చేసుకుని రెక్కాడితేనే మా డొక్క నిండుతుంది. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పనులు లేక పస్తులుంటున్నాం. మరో పనిచేసే అలవాటు లేక కూలి పని కోసం రోజు ఆశగా వచ్చి నిరాశగా వెనుదిరుగుతున్నాం.

– ఎం.ఈశ్వరమ్మ, హనుమంతవాక

వర్షం మా ఉపాధిని దెబ్బ తీసింది



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు మా ఉపాధిని దెబ్బతీసాయి. రోజంతా పని చేసుకుంటే కాని చేతిలో పైసలుండని మా లాంటి వారికి వర్షం పస్తులు పాలు చేసింది. ఏదైన పని దొరుకుందని వస్తే, ఎదురు చూపులు తప్పితే పని దొరకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

– టి.రాము, శివాజీపాలెం

పనిలేక ఆర్థిక ఇబ్బందులు




జోరుగా కురుస్తున్న వర్షానికి నిర్మాణం రంగంలో చాలా వరకు పనులు నిలిచిపోయాయి. దీంతో మాకు పనులు లేకుండా పోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. వర్షం కారణంగా చాలా వరకూ ఎక్కడి పనులు అక్కడే నిలిపేశారు.

– ఎస్.రమణ, ఇసుకతోట

పింఛన్లు పంపిణీ చేసిన జీవీఎంసీ కమిషనర్

దాబాగార్డెన్స్: జోన్–4 పరిధి 28వ వార్డు పితానిదిబ్బ, బంగారమ్మ ఆలయ సమీపంలో పలువురు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు శనివారం జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు ఈ పింఛన్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన క్రమం తప్పకుండా ప్రభుత్వం పింఛన్లు అందిస్తోందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సెప్టెంబర్ ఒకటో తేదీ ఆదివారం కావడం, ప్రభుత్వ సాధారణ సెలవు కారణంగా ముందు రోజే లబ్ధిదారులకు పింఛన్లు అందజేసినట్లు తెలిపారు.

నైపుణ్యాభివృద్ధి, నాయకత్వ లక్షణాలపై సదస్సు



ప్రొఫెసర్ చంద్రమోహన్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

తాటిచెట్లపాలెం: ఆంధ్రా యూనివర్సిటీలో రాజనీతి శాస్త్రం, పాలనా శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి, నాయకత్వ లక్షణాలు అనే అంశంపై శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెంట్రల్ యూనివర్సిటీ తమిళనాడు ప్రొఫెసర్ ఎ.చంద్రమోహన్ ప్రసంగించారు. రాజకీయ, సాంకేతిక, ప్రభుత్వ పాలనా, మానవ, సంభావిత, వ్యక్తిగత, వృత్తి నైపుణ్యాలు, డిజిటల్ టెక్నాలజీ, కమ్యూనికేషన్, క్రియాత్మక మేదస్సు నైపుణ్యాల గురించి వివరించారు. అనంతరం చంద్రమోహన్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఆచార్య పేటేటి ప్రేమానందం అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ హరిబాబు, డాక్టర్ రత్నరాజు, డాక్టర్ సత్యనారాయణ, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.

వాతావరణ మార్పులపై పెయింటింగ్ పోటీలు

సీతంపేట: లంకపల్లి బుల్లయ్య కళాశాలలో వాతావరణ మార్పు అనే అంశంపై స్టూడెంట్ సొసైటీ ఫర్ క్లైమేట్ చేంజ్ ఎన్జీవో సంస్థ, సీడ్స్ ఆఫ్ పీస్ అనే యూఎస్ సంస్థతో కలిసి రెండు రోజులపాటు ఆర్ట్ ఎగ్జిబిషన్, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. కళాశాలకు చెందిన 70 మంది గ్రీన్ క్లబ్ విద్యార్థులు మూడు బృందాలుగా పాల్గొన్నారు. విద్యార్థులు గీసిన పెయింటింగ్‌లు, ఆర్ట్ ఎగ్జిబిషన్ ఆలోచింపజేశాయి. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ బహుమతులు అందజేశారు.